అందం.. ఆహ్లాదం

- ఆకర్షణీయంగా భరత్‌నగర్ పార్కు
- పరుచుకున్న పచ్చదనం
- చిన్నారులకు ఆట పరికరాలు
- ఓపెన్ జిమ్, వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు
- వసతులపై సందర్శకుల హర్షం


కూర్మన్నపాలెం భరత్‌నగర్ పార్కులో సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన బెంచీలు


ఆకర్షణీయంగా పార్కు ప్రహరీ గోడ, ఎంట్రన్స్ గేటు

కూర్మన్నపాలెం: చక్కని వాతావరణంలో సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతోంది భరత్‌నగర్ పార్కు. జీవీఎంసీ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెంలోని ఈ పార్కు గతంలో నిరాదరణకు గురై, కంపచెట్లతో నిండి అడుగుపెట్టేందుకు వీల్లేకుండా ఉండేది. జీవీఎంసీ ప్రత్యేక నిధులను కేటాయించడంతో పార్కు రూపురేఖలే మారిపోయాయి. చుట్టూ పరచుకున్న పచ్చదనం, సందర్శకులు కూర్చునేందుకు వీలుగా బెంచీలు, చిన్నారులకు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. ఆహ్లాదంతో పాటు ఆరోగ్యానికీ ప్రాధాన్యం ఇస్తూ వాకింగ్‌ట్రాక్ నిర్మాణం, ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.16లక్షలతో అభివృద్ధి

జీవీఎంసీ సహకారంతో పార్కు నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పార్కును ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పార్కులో అందమైన పూలమొక్కలు ఏర్పాటు చేయడంతో పార్కు కళకళలాడుతోంది. పార్కు సంరక్షణతో పాటు సుందరీకరణకు సుమారు రూ.16 లక్షల జీవీఎంసీ నిధులను సమకూర్చడంతో పార్కు అందంగా తయారై ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతోంది. ఓపెన్ జిమ్, కూర్చునేందుకు బల్లలు, ప్రహరీ గోడ, వాకింగ్ ట్రాక్, పార్కు చుట్టు డ్రైనేజీ, ప్రవేశ ద్వారం ఇలా అన్ని సదుపాయలతో పార్కు ప్రజలకు ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని పంచుతోంది.

పెరుగుతున్న సందర్శకులు

పార్కులో చక్కని వసతులు, వాతావరణం కల్పించడంతో సందర్శకుల సంఖ్య పెరుగుతోంది. ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో ఆరోగ్యాభిలాషులు రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుకు వస్తున్నారు. ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని పొందుతున్నారు.


పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు


పార్కులో వాకింగ్ ట్రాక్

జీవీఎంసీ సహకారంతో అభివృద్ధి

జీవీఎంసీ సహకారంతోనే పార్కు అభివృద్ధి సాధ్యమైంది. పార్కు గురించి గతంలో మేయర్ హరివెంకటకుమారికి, ఎమ్మెల్యే నాగిరెడ్డికి వినతి పత్రాలు సమర్పించడంతో పట్టణాభివృద్ధిలో భాగంగా తక్షణమే నిధులను కేటాయించి పార్కు అభివృద్ధికి తోడ్పడ్డారు. జీవీఎంసీ నిధులతో ప్రహరీ గోడ, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, పిల్లలకు ఆట పరికరాలు వంటివి సమకూర్చారు. పార్కును మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రూపొందించి, నివేదికను ప్రభుత్వానికి పంపాము. ప్రభుత్వ సహకారంతో భవిష్యత్తులో పార్కును మరింతగా అభివృద్ధి చేయాలని చూస్తున్నాం.

– నరసింహారావు, పార్కు కమిటీ అధ్యక్షుడు

వాకింగ్‌కు అనువుగా ఉంది



ఆరోగ్య రీత్యా వాకింగ్ చేయాలన్న డాక్టర్ సలహాతో రోజూ పార్కుకు వాకింగ్ వెళ్తున్నా. గతంలో పార్కులో నడవాలంటేనే భయమేసేది. ఇప్పుడు పార్కును బాగా అభివృద్ధి చేశారు. వాకింగ్ ట్రాక్‌ను సుందరంగా తీర్చిదిద్దడంతో వాకింగ్ చేయడానికి బాగుంది. మాలాంటి వారికి చాలా ఉపయోగం.

– జె.పైడికొండ, భరత్‌నగర్

లారీ ఢీకొని మహిళ మృతి


షేక్ అస్మతున్నిషా (ఫైల్)

కూర్మన్నపాలెం : స్కూటీని వెనుక నుంచి టిప్పర్ లారీ బలంగా ఢీకొన్న సంఘటనలో ఓ మహిళ మృతి చెందగా, మరో మహిళ తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్న ఘటనపై లా అండ్ ఆర్డర్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. గాజువాక అజీమాబాద్‌కు చెందిన రబియా బేబీ షేక్, అత్త షేక్ అస్మతున్నిషాతో కలిసి స్కూటీపై గాజువాక నుంచి అగనంపూడి ఆస్పత్రికి వెళ్తున్నారు. అగనంపూడి టోల్‌గేటు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న టిప్పర్‌లారీ స్కూటీని బలంగా ఢీకొనడంతో కోడలు రబియా బేబీ షేక్‌కు, అత్త షేక్ అస్మతున్నిషా(58)కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యలో షేక్ అస్మతున్నిషా మృతి చెందారు. అపస్మారక స్థితిలో ఉన్న రబియా బేబీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతురాలి భర్త ఖాదర్‌వలీ పోర్టులో వెల్డింగ్ పనులు చేస్తుంటారు. మృతురాలి అన్నయ్య షేక్ అమీర్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, పోలీసులు విచారిస్తున్నారు.

68వ వార్డులో నీటి సరఫరాకు అంతరాయం నేడు

అక్కిరెడ్డిపాలెం: మేఘాద్రి గెడ్డ నుంచి మింది ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వచ్చే 600 ఎంఎం సీఐ పైపు పగిలినందున మరమ్మతుల నిమిత్తం 68వ వార్డులోని పలు ప్రాంతాల్లో ఆదివారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ తాగునీటి విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కారణంగా మింది, రాంనగర్, కాళికానగర్, గుడివాడ అప్పన్న కాలనీ, రాజీవ్‌నగర్, హిందూస్థాన్ షిప్‌యార్డు, కోరమండల్ లిమిటెడ్, ఇండియన్ మారిటైం యూనివర్సిటీ, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, అల్యూమ్లోరైడ్ లిమిటెడ్, భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (భెల్), విశాఖ డెయిరీ, ఐ.ఎస్.ఎస్.ఏకశిల, విశాఖ వైర్ రోప్స్ లిమిటెడ్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు, పరిశ్రమల వారు సహకరించాలని కోరారు.

ఇంటింటికీ జాతీయ పతాకాలు


జాతీయ జెండాలను ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి

గాజువాక : గాజువాక బీజేపీ నాయకులు శనివారం జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ జెండాలను అందజేశారు. తొలుత పాత కర్ణవానిపాలెంలోని బీజేపీ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన నాయకులు అనంతరం గాజువాకలోని వివిధ ప్రాంతాల్లో జెండాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గూటూరు శంకరరావు, పి.నాగేశ్వరరావు, కోసూరు తాతారావు, పేర్ల అప్పారావు, రంజిత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అవసరం


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : విద్యార్థులు విద్యతో పాటు నాయకత్వ లక్షణాలను కూడా పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. తద్వారా భావిభారత ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. స్థానిక విద్యావికాస్ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఘం ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటు హక్కుపై ఆయన అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థి సమాజానికి సేవలు అందించాలని సూచించారు. అనంతరం 400 మంది విద్యార్థులు బ్యాలెట్ ద్వారా తమ విద్యార్థి సంఘం నాయకులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.వశిష్ట, ప్రిన్సిపాల్ ఆర్.కిరణ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

‘డిజిటల్ లావాదేవీలపై అవగాహన తప్పనిసరి’


వెబినార్‌లో పాల్గొన్న అతిథులు

సబ్బవరం: డిజిటల్, బ్లాక్‌చెయిన్ లావాదేవీలకు సంబంధించి వినియోగదారుల్లో అవగాహన అవసరమని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ డా పి.శ్రీ సుధ అన్నారు. వర్సిటీ ఆధ్వర్యంలో శనివారం డిజిటల్ యుగంలో వినియోగదారుల రక్షణ అంశంపై వెబినార్ జరిగింది. ఈ సందర్భంగా ఔరంగాబాద్‌లోని మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ కె.వి.ఎస్ శర్మ మాట్లాడుతూ ఆర్థిక లావాదేవీలు నిర్వహించడానికి సహాయపడే యాప్‌ల గురించి వివరించారు. సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ రీసెర్చ్ ప్రకారం డిజిటల్ ప్లాట్‌ఫాంలు అన్ని స్థాయి వ్యక్తులను ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. యాప్‌ల ద్వారా వచ్చే సమస్యలను పరిష్కరించడానికి ఓ వేదిక ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌ఎల్‌యూ రాంచీ వీసీ అశోక్ ఆర్. పాటిల్ మాట్లాడుతూ వినియోగదారులను తప్పుదారి పట్టించే ప్రకటనల విషయంలో జరిమానా విధించవచ్చన్నారు. వినియోగదారుల నిపుణుడు సురేష్ మిశ్రా, సైబర్ లా నిపుణుడు ప్రశాంత్ మాలి మాట్లాడారు. ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్, పి.వి.వి.ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే వేగవంతం చేయాలి


ఓటర్ల సర్వేపై సిబ్బందికి సూచనలిస్తున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

పెదగంట్యాడ: ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మారెడ్డి బీఎల్‌వోలను ఆదేశించారు. సీతానగరం గ్రామంలోని బూత్ నంబర్ 254 పరిధిలో జరుగుతున్న ఓటర్ల సర్వేను శనివారం ఆయన మండల తహసీల్దార్ రమాదేవితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని సూచించారు. మార్పులు, చేర్పులపై దృష్టి పెట్టాలన్నారు. ఒకే ఇంట్లో ఎక్కువ ఓట్లు ఉంటే వాటిని నిశితంగా పరిశీలించాలని సూచించారు. త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

అమరులకు ఘన నివాళి


అమరవీరులకు నివాళులర్పిస్తున్న నేవీ అధికారులు

సింధియా: శౌర్య దివాస్‌ను పురస్కరించుకుని ఐఎన్ఎస్ కర్ణలోని శౌర్యస్థలం వద్ద తూర్పు నావికాదళం తరపునన కమాండర్ సీఎస్ నాయర్ మార్కోస్ బ్రేవ్ హార్ట్స్‌కు ఘన నివాళులర్పించారు. మార్కోస్ బ్రేవ్ హార్ట్స్ జ్ఞాపకార్థం ఆపరేషనల్ క్యాజువాలిటీగా మారిన శౌర్య స్థలాన్ని సందర్శించిన పలువురు అనుభవజ్ఞులు వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. మార్కోస్ బ్రేవ్ హార్ట్స్‌గా పిలువబడే స్వర్గీయ అనుకుష్‌శర్మ, స్వర్గీయ చందక గోవింద ఇద్దరూ 2023 మధ్యలో విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన వీరులు. వీరి స్మారకాల వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు.

‘సకల కళాకారుల’ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

సీతంపేట: విశాఖ సకల కళాకారుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. సంఘం గౌరవాధ్యక్షుడిగా సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు, అధ్యక్షురాలిగా సినీ కవి జాలాది కుమార్తె జాలాది విజయ, ప్రధాన కార్యదర్శిగా చెన్నా తిరుమలరావు, కార్యదర్శిగా కె.లోకేశ్వరరావు, కోశాధికారిగా మధుపాడ రమణి, ఉప అధ్యక్షుడిగా జె.ఎం.ఆర్ నెహ్రూ, ఉపాధ్యక్షులుగా ఎం.త్రినాథరావు, దండు నాగేశ్వరరావు, అరుణ్‌సాయి కుమార్, సహాయ కార్యదర్శులుగా మిమిక్రీ శ్రీనివాస్, కందర్ప రాధ, జి.జగదీష్, నిర్వాహక కార్యదర్శిగా కోరుకొండ రంగారావులతో పాటు మరో 13 మంది సలహాదారులు, ఈసీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవాధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. అధ్యక్షురాలు జాలాది విజయ మాట్లాడుతూ నగరంలోని కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్యాలు, ఏకపాత్రాభినయం, సినీ గీతాలు, మిమిక్రీ, డోనాల్డ్ డక్ ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, బొట్టా వేణు, దండు నాగేశ్వరరావు, కొరిటాల ప్రభాకర్, ఎం.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొలువుదీరనున్న భారీ గణనాథుడు


భారీ గణనాథుని కొలువుదీర్చేందుకు నిర్మిస్తున్న వేదిక

అక్కిరెడ్డిపాలెం: గుడివాడ అప్పన్నకాలనీలోని గ్లోబెక్స్ పక్కనున్న సీఎంఆర్ స్థలంలో భారీ గణనాథుడు కొలువుదీరనున్నారు. వినాయకచవితిని పురస్కరించుకుని భారీ విగ్రహాన్ని నెలకొల్పేందుకు శ్రీ మహాగణపతి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే భూమిపూజ చేశారు. విగ్రహం ఏర్పాటుకు అన్ని రకాల అనుమతులు పొందామని ఉత్సవ కమిటీ ప్రతినిధి బి.త్రిమూర్తులు తెలిపారు. 21 రోజుల పాటు వినాయక చవితి పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం పరిధి వీఎస్ఈజెడ్ విద్యుత్ సబ్ స్టేషన్లలోని 33/11 కేవీ ఫీడర్‌లో మెయింటెనెన్స్ పనులను చేపట్టనున్న దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. 11 కేవీ వీఎస్ఈజెడ్ ఇండస్ట్రియల్ ఫీడర్, 11 కేవీ హెచ్‌బీఎల్, 11 కేవీ అడ్మిన్ ఫీడర్ పరిధిలోని వీఎస్ఈజెడ్ క్యాంపస్ మొత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

తిరుమల బాలాజీకి విశేష పూజలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి గీతాపారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, ప్రత్యేక పుష్పాలతో సహస్రనామార్చన చేశారు. విశేష హారతులిచ్చారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

పెదగంట్యాడ: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎం.జాన్‌డేన్ కోరారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 23 మంది మహిళలకు సమతానగర్‌లో శనివారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నక్క లక్ష్మణరావు, విక్టర్ రాజు, ఎం.సూర్యనారాయణ, కృష్ణవేణి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ప్రాధాన్యంపై వినతి


సీజీఎం గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న పైడిరాజు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు పోస్టుల్లో నిర్వాసితులకు 50 శాతం ప్రాధాన్యం కల్పించాలని ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు కోరారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీని శనివారం కలిసి, వినతిపత్రం అందజేశారు. కోక్‌ఓవెన్ విభాగంలోని పలు కాంట్రాక్టర్లు తమ నియామకాల్లో నిర్వాసితులకు బదులు బయట వ్యక్తులకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. నోటీసు పే, బోనస్, ఈఎస్ఐ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పనితీరుపై ప్రతి ఇంటా ఆనందం


మహిళకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరుపై గడప గడపలోనూ ఆనందం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సంక్షేమ పథకాల అమలులో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఈ ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. జీవీఎంసీ 86వ వార్డు భరత్‌నగర్-2 సచివాలయ పరిధిలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సేవా ఎన్‌క్లేవ్ దగ్గర పార్కు నుంచి వుడా ఫేజ్-7, మాతృశ్రీనగర్ తదితర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావుతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. మీ ఇంటికి వచ్చాం.. సమస్యలేవైనా ఉంటే తెలియజేయండి అంటూ స్థానికులతో ఆత్మీయంగా సంభాషించారు. వారు తెలియజేసిన సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, వార్డు అధ్యక్షుడు వెలుగుల పరశురాముడు, చేగొండి శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్, శ్రీనివాస్ పట్నాయక్, బాలకృష్ణ, వార్డు మహిళా అధ్యక్షురాలు నిర్మల, వరలక్ష్మి, భూపతిరాజు శ్రీనివాసరాజు, శ్రీను, పట్నాల రాజు, వివిధ శాఖల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆణిముత్యాలకు నగదు ప్రోత్సాహకాలు


నగదు ప్రోత్సాహకం అందుకున్న విద్యార్థులతో ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి ప్రాంతంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ నగదు ప్రోత్సాహకాలు అందించి, సత్కరించింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో అగనంపూడి సీడబ్ల్యూసీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అగనంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ టాపర్లు షేక్ షబ్బీర్ మొహిద్దీన్, దాసరి పూర్ణ పూజిత, పెరుగు నాగమణికి వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.5 వేలు వంతున నగదు అందించారు. అలాగే పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన అట్టా ఉమామహేశ్వరి, నీలం సునీత, ఆదిత్య సతీష్‌కుమార్‌లకు ఇదేవిధంగా నగదు ప్రోత్సాహకాలు అందించారు. అందరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సలహాదారుడు పట్టా రామఅప్పారావు, వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, అగనంపూడి, పినమడక పాఠశాలల హెచ్‌ఎంలు కృష్ణారావు, భీమ శంకరరావు, కమిటీ ప్రతినిధులు బంధం అప్పలరాజు, విందుల వరహాలు, కిడిమి హనుమంతురావు, లక్కరాజు రాము, పొన్నగంటి కొండలరావు కరణం పైడిరాజు పాల్గొన్నారు.

విభజన హామీలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం


912వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి, ప్రజలను మోసం చేసిన కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో 912వ రోజు శనివారం సంస్థకు చెందిన డబ్ల్యూఆర్‌ఎం-1,2 విభాగ కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నష్టాల్లోకి నెట్టిన కేంద్రప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. రానున్న కాలంలో లక్షలాది మంది కార్మికులు, కర్షకులు, నగర పౌరులతో సమావేశం నిర్వహించి విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఆధునిక సౌకర్యాలు


విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ మమతామయి

గాజువాక : శంకర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయడంలో భాగంగా గాజువాకలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో అత్యాధునిక సౌకర్యాలను అందుబాటులోకి తెస్తున్నట్లు ఆ సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మమతామయి పాణిగ్రాహి తెలిపారు. గాజువాకలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గాజువాక ఆస్పత్రిలో రెండు అల్ట్రా మోడ్రన్ ఆపరేషన్ థియేటర్లు, 20 పడకలు, అత్యాధునిక రోగ నిర్ధారణ విధానాలు, ల్యాబ్ సౌకర్యం, ఆప్టికల్ షాప్, ఫార్మసీ మొదలైనవి అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ ఆస్పత్రిలో కంటి శుక్లం, రెటీనా ఆపరేషన్లు సహా అన్ని ఆధునిక సౌకర్యాలను కల్పిస్తామన్నారు. గాజువాక, పారిశ్రామిక ప్రాంత పౌరులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ నటాషా, డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలి


వర్క్‌షాప్‌లో పాల్గొన్న స్వామి రఘువీరానంద

గాజువాక : యువత జీవితంలో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని చిన్మయ మిషన్ ఉక్కునగరం శాఖ ప్రతినిధి రఘువీరానంద స్వామి సూచించారు. యువతలో పరివర్తన, మనోవికాసం, దేశభక్తి అంశాలపై స్థానిక చైతన్య మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించేవారు ప్రశాంతంగా ఉంటారని, తమ లక్ష్యసాధనవైపు దూసుకుపోతారని అన్నారు. ప్రతీ ఒక్కరు క్రమశిక్షణ, నిబద్ధతలను కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా టీ20 టూల్స్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్‌పై వివిధ అంశాలను వివరించారు. ప్రశాంతంగా ఉన్నప్పుడే లక్ష్య సాధనకు అవసరమైన శక్తి సామర్థ్యాలను పొందగలుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ ప్రతినిధులు జయంతి కుమార్, రికితేష్ కుమార్, వంశీ, కల్యాణి, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. చంద్రమహాలక్ష్మి, పీజీ డైరెక్టర్ పి.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతికి సంతాపం

పెదగంట్యాడ: ప్రజా గాయకుడు గద్దర్ మృతి తీరని లోటని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్ అన్నారు. పెదగంట్యాడ కూడలిలో శనివారం నిర్వహించిన సంతాప సభలో గద్దర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గద్దర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కణితి అప్పలరాజు, పులి రమణారెడ్డి, సీమసిరి శ్రీను, వంశీకృష్ణ యాదవ్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.